క్లుప్తంగా

ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరి

చేర్యాల మిషనర్ రాజేంద్రకుమార్



ఫంక్షన్ హాల్ గేటుకు తాళం వేసిన సిబ్బంది

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో వ్యాపారాలు నిర్వహించే ప్రతీ ఒక్కరు విధిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలని, లేనిపక్షంలో మున్సిపల్ చట్టం–2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ అన్నారు. గురువారం పట్టణ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా నడుస్తున్న రేణుక గార్డెన్, పీఎంఆర్, కల్యాణి గార్డెన్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో వ్యాపారాలు నిర్వహిస్తున్న ప్రతీ ఒక్కరూ విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలామృతం బలం

వర్గల్(గజ్వేల్): ఆరు నెలలు నిండిన చిన్నారులకు బాలామృతం ఎంతో పుష్టికరమని వర్గల్ సెక్టర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి అన్నారు. గురువారం మీనాజీపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విటమిన్లు, మినరల్స్‌తో కూడిన బాలామృతం ఎన్నో పోషకాలు కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ రాణి, అంగన్‌వాడీ టీచర్లు సంతోషి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

దుబ్బాక: సీఎంఆర్ఎఫ్ పథకం పేద ప్రజలకు వరమని కౌన్సిలర్ ఆస యాదగిరి అన్నారు. దుబ్బాక పట్టణంలో 14 వార్డుకు చెందిన ఆస సురేష్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో సీఎం సహాయ నిధి పథకం కింద ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి చొరవతో మంజూరైనా రూ.25 వేల చెక్కును గురువారం కౌన్సిలర్ యాదగిరి బాధితుడికి అందించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. క్యాక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గవ్వల గణేష్, హెచ్ఎం బస్వరాజు, ఉపాధ్యాయులు రాజు, చంద్రమౌళి, శ్రీనివాస్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

సిద్దిపేటజోన్: అమరజీవి పొట్టి శ్రీరాములు 122వ జయంతిని గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. స్థానిక కాంచిట్ చౌరస్తాలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య, వాసవీ క్లబ్ ప్రతినిధులు అయిత రత్నాకర్, శ్రీనివాస్, ప్రసాద్, కల్పన, వేణుగోపాల్, సంతోష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత

దుబ్బాకటౌన్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వారోత్సవాల సందర్భంగా గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలు నేడు రాజకీయంగా, విద్య, ఉద్యోగాలు, పారిశ్రామిక రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ గణేష్‌రెడ్డి, మెప్మా సీఈవో రేణుక, ఆర్పీలు, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అనుబంధ కమిటీలకు ప్రతినిధులు వీరే

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండల బీఆర్ఎస్ అనుబంధ కమిటీల అధ్యక్షుల ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. గురువారం మండల పార్టీ అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి సమక్షంలో వర్గల్‌లో నిర్వహించిన సమావేశంలో మాజీ అధ్యక్షుడు నాగరాజు, జెడ్పీటీసీ బాలూయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎంపీపీ లతరమేశ్‌గౌడ్, వైస్‌ఎంపీపీ బాల్‌రెడ్డి పాల్గొన్నారు. విభాగాల వారీగా అధ్యక్షులను ఎంపిక చేశారు. యూత్ అధ్యక్షుడుగా లింగ నాగరాజు, రైతు విభాగం మాదిరెడ్డి లక్ష్మారెడ్డి, సోషల్ మీడియా మహ్మద్ మోసిన్, ఎస్సీసెల్ ఎల్లంకుల కుమార్, ఎస్టీసెల్ అజ్మీర నాగరాజు, బీఆర్‌కేవీ దాచారం స్వామి, మహిళా విభాగం బొర్ర స్వప్న, మైనారిటీ మహ్మద్ బాబా, విద్యార్థి విభాగం తాళ్ల స్వామి, బీసీసెల్ జాలిగామ మురళీగౌడ్ నియమితులైనట్లు మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ప్రకటించారు.



వర్గల్ మండల బీఆర్ఎస్ అనుబంధ కమిటీల పేర్లు వెల్లడిస్తున్న వెంకట్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

- మండల సమావేశంలో ఎంపీపీ బాలకృష్ణ
- అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ బాలకృష్ణ

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చేస్తూ, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాల ద్వారా గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎంపీపీ బాలకృష్ణ అన్నారు. గురువారం నారాయణరావుపేట మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నారాయణరావుపేట గ్రామపంచాయతీ భవనం మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు శాఖలపరంగా సాధించిన ప్రగతి వివరాలను చదివి వినిపించారు. అనంతరం వైస్ ఎంపీపీ సంతోష్, సర్పంచ్‌లు మాట్లాడారు. రెవెన్యూ అధికారులు సమావేశానికి గైర్హాజరు కావడం ఎంతవరకు సమంజసమన్నారు. గతంలోనూ సభ మర్యాదను పాటించలేదన్నారు. ఎమ్మార్వో, ఆర్ఐలకు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోవడంలో ఉన్న శ్రద్ధ సమావేశంపై లేదన్నారు. గతంలో చేసిన తీర్మానాల పురోగతిపై అధికారుల వద్ద ఎలాంటి సమాచారం లేదన్నారు అధికారులు పేరుకు మాత్రమే ఉన్నారని పనులపై దృష్టి సారించడం లేదని ఆరోపించారు. నామమాత్రంగా బస్సు సౌకర్యం కల్పించారని, ప్రస్తుత పరీక్షల సమయంలో బస్సు వేళలపై ఎటువంటి సమాచారం లేదన్నారు. ఈ విషయంలో ఎంపీడీఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి మండిపడ్డారు. మాటిండ్ల మదిర గ్రామం శేఖర్‌రావుపేటను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని సర్పంచ్ నారాయణ సభ దృష్టికి తీసుకురావాలని కోరగా ఎంపీటీసీ హరీశ్ తీర్మానించాలని కోరగా వైస్‌ఎంపీపీ సంతోశ్ తీర్మానాన్ని బలపరిచారు. సభ జరుగుతున్నప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు ముచ్చట్లు చెప్పుకోవడం గమనార్హం. ఆయిల్‌ఫాం సాగు విస్తీర్ణం పెంచేలా అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ సూచించారు. కంటివెలుగు ప్రారంభం కాని గ్రామాల్లో త్వరగా ప్రారంభించాలన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): మండలానికి మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. బెజ్జంకి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ లింగాల నిర్మల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు మంజూరైన పంచాయతీ, మహిళా సంఘ భవనాలను పూర్తి చేయాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి మన ఊరు మన బడిలో మంజూరైన అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అప్రమత్తం కావాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ కనగండ్ల కవిత, తహసీల్దార్ విజయ ప్రకాశ్‌రావు, ఎంపీడీఓ అంజయ్య, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

గులాబీ దండులా కదలిరండి

- ప్రాజెక్టులు నిర్మించిన ఘనత బీఆర్ఎస్ సర్కార్‌దే..
- ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈనెల 20వ తేదీన హుస్నాబాద్ పట్టణంలోని బస్‌డిపో గ్రౌండ్‌లో జరగనున్న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ బహిరంగంగా సభకు పార్టీ శ్రేణులు గులాబీ దండులా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం అక్కన్నపేటలో ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశానికి హాజరై మాట్లాడారు గౌరవెల్లి ప్రాజెక్టును 8 టీఎంసీల సామర్థ్యం పెంచి నిర్మించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. అదేవిధంగా త్వరలో గండిపల్లి ప్రాజెక్టు నిర్మాణ పనులను కూడా చేపడతామన్నారు. ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట వరకు నాలుగు వరుసల రోడ్డును తీసుకొచ్చిన ఘనత మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌కే దక్కిందన్నారు.70 ఏళ్ల పరిపాలనలో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ దేశానికి చేసింది ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అక్కన్నపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై భగ్గు



గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

హుస్నాబాద్: రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలను ప్రశ్నార్థకం చేసిన టీఎస్ పీఎస్సీ పేపర్ లీకేజీ ఉదంతాన్ని నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో రాస్తారోకో నిర్వహించారు. టీఎస్ పీఎస్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వివేక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిది ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు లేకుండా చేసిన సీఎం కేసీఆర్ ఒక తరం విద్యార్థుల జీవితాలను నాశనం చేశాడన్నారు.

సిద్దిపేటకమాన్: పేపర్ లీకేజీల వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్లే టీఎస్పీఎస్సీ పేపర్ లీకయిందన్నారు. లీకేజీ కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహించిన టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని పదవి నుంచి తొలగించాలన్నారు.

గజ్వేల్‌రూరల్: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీపై సీబీఐ విచారణ జరిపించడంతో పాటు సీఎం కేసీఆర్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్‌సీ కార్యాలయం వద్ద పేపర్ లీకేజీ ఘటనను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్‌పై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ గురువారం బీజేవైఎం, బీజేపీ నాయకులు గజ్వేల్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

సిద్దిపేటజోన్: టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం డిగ్రీ కళాశాల రోడ్డుపై ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ జోనల్ ఇన్‌చార్జి సంతోశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోహెడరూరల్(హుస్నాబాద్): టీఎస్‌పీఎస్‌సీ నిర్వహించిన ఏఈ పరీక్ష పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చెంచెర్వుపల్లిలో మాట్లాడారు. ఏఈ ప్రశ్న పత్రం లీక్ కావడం బాధాకరమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్టీసీ డిపోలో మజ్జిగ పంపిణీ



సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేస్తున్న డీఎం సుఖేందర్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: వేసవి దృష్ట్యా సిద్దిపేట ఆర్టీసీ డిపోలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బందికి డీఎం సుఖేందర్‌రెడ్డి మజ్జిగ పంపిణీ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ వేసవిలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బంది ఉపశమనం కోసం మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. వేసవిలో ఆర్టీసి సిబ్బందితో పాటు ప్రతీ ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ



ఎన్సాన్‌పల్లిలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ

సిద్దిపేటఅర్బన్: మండలంలోని ఎన్సాన్‌పల్లిలో గల తెలంగాణ రాష్ట్ర గురుకుల కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణను అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రంలోని ప్రతీ హాలులో కలియతిరిగారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే ఇన్విజిలేటర్లకు చెప్పాలన్నారు. పరీక్ష ముగిసిన తర్వాత ఎస్కార్ట్‌గా పోలీస్ సిబ్బంది ఉండి తీసుకువెళ్లే విధంగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరూ గుమిగూడకుండా జాగ్రత్తపడాలని సూచించారు.

ఆలస్యంతో నోఎంట్రీ

హుస్నాబాద్: ఇంటర్మీడియట్ పరీక్షలు రెండవ రోజు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం నిమిషం నిబంధన కారణంగా ఓ విద్యార్థిని అనుమతించలేదు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సెంటర్‌కు ఓ విద్యార్థి పరీక్ష సమయానికి ఆలస్యంగా రావడంతో పరీక్ష రాసేందుకు అధికారులు నిరాకరించారు. విద్యార్థి బతిమిలాడిన వారు వినకపోవడంతో చేసేది ఏమీలేక ఇంటికి వెళ్లిపోయాడు.



విద్యార్థిని ప్రశ్నిస్తున్న మహిళా కానిస్టేబుల్

ఆయుర్వేదంతోనే ఆరోగ్యం



కొమురవెల్లి(సిద్దిపేట): విద్యార్థులకు న్యూట్రిషన్ కిట్స్ అందిస్తున్న ఎంపీపీ తలారి కీర్తన

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆయుర్వేదంతోనే ఆరోగ్యమని ఆయుర్వేద వైద్యురాలు దీపాంజలి అన్నారు. గురువారం జగదేవ్‌పూర్‌లో బాలికల పాఠశాలలో విద్యార్థినిలకు న్యూట్రిషన్ కిట్లు, రాగి లడ్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యూట్రిషన్ కిట్లల్లో పోషకాహారం ఉంటుందని, బాలికలు తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్స్‌తో..

కొమురవెల్లి(సిద్దిపేట): న్యూట్రిషన్ కిట్స్‌తో బాలికలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆయుర్వేద వైద్యులు డాక్టర్ రజని అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఆయుష్ హెల్త్ కిట్స్ ఎంపీపీ తలారి కీర్తనతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సార్ల లత, ఆయుష్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పార్లమెంట్ స్థాయి క్రీడోత్సవాలు



క్రీడాకారులతో బీజేపీ నాయకులు

హుస్నాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నేతృత్వంలో హుస్నాబాద్ అసెంబ్లీ పరిధిలో ఖేలో కరీంనగర్. జీతో కరీంనగర్, కరీంనగర్ పార్లమెంట్ స్థాయి క్రీడోత్సవాలు గురువారం ముగిశాయి. పట్టణంలోని సబ్ స్టేషన్ గ్రౌండ్‌లో వింజపల్లి వర్సెస్ సుందరగిరి టీమ్‌లు ఫైనల్‌లో తలపడ్డాయి. సుందరగిరి జట్టు విజయం సాధించింది. గెలిచిన జట్టు, ఓడిన టీమ్‌లు కరీంనగర్‌లో నిర్వహించే పార్లమెంట్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొటాయని నిర్వాహకులు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మాజీ రాష్ట్ర హౌస్‌ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి విజేతలను అభినందించారు. పోటీల్లో గెలుపు ఓటమి సహజమన్నారు. క్రీడా స్ఫూర్తితో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, జిల్లా కోశాధికారి దొడ్డి శ్రీనివాస్, క్రీడోత్సవాల అసెంబ్లీ కోఆర్డినేటర్ కుమారస్వామి, హుస్నాబాద్, అక్కన్నపేట బీజేపీ మండల అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలి

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): కార్యకర్తలు మొక్కవోని దీక్షతో పనిచేసి బీఆర్ఎస్ పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. గురువారం మండల పార్టీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని వారికి ఏసమయంలో ఏఆపద వచ్చినా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఏప్రిల్‌లో నిర్వహించే ఆత్మీయసభకు రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు కొత్త ప్రభాకరరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి బసవరాజు సారయ్య హాజరవుతున్నందున అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియలో వచ్చే తప్పుడు కథనాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఏఎంసీ చైర్మన్ రాజయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, అనుబంధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో పేదల జీవితాల్లో వెలుగు

జెడ్పీటీసీ యాదగిరి



దుబ్బాక: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ యాదగిరి తదితరులు



మద్దూరు(హుస్నాబాద్): కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

దుబ్బాక: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని తెచ్చి పేదల జీవితాల్లో వెలుగు నింపుతోందని రాయపోల్ జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి అన్నారు. గురువారం రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ వెంకట్రామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహులు, కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ పర్వేజ్, బీఆర్ఎస్ నాయకులు, కంటి వెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు దేశానికే ఆదర్శం

మద్దూరు(హుస్నాబాద్): కంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అన్నారు. గురువారం దూల్మిట్ట మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ దుబ్బుడు దీపికవేణుగోపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అంధత్వ నివారణే లక్ష్యంగా సీయం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. నేత్ర పరీక్షలు అనంతరం కళ్లద్దాలు, మందులు, అవసరమైతే శస్త్రచికిత్స చేయించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇమ్మడి సంజీవ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాచగొని పద్మవెంకట్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు బడుగు సాయిలు, బీఆర్ఎస్ నాయకులు నలగొప్పుల రాములుగౌడ్, తాళ్లపల్లి భిక్షపతిగౌడ్, కృష్ణ, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వేసవిలో తైదంబలి తాగాలి

తొగుట(దుబ్బాక): వేసవిలో తైదంబలి తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చందాపూర్ సర్పంచ్ బొడ్డు నర్సింహులు అన్నారు. చందాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సిద్దిపేట శ్రీసత్య సాయి సేవాసమితి ఆధ్వర్యంలో తైదంబలి పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కంకనాల నర్సింలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, హెచ్ఎం సిద్దేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ సమన్వయంతో పని చేయాలి

నంగునూరు(సిద్దిపేట): బూత్ కమిటీ సభ్యులు స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు బెదురు కుమరస్వామి అన్నారు. రాజగోపాల్‌పేటలో గురువారం బూత్ స్వశక్తి కిరణ్ అభియాణ్ కార్యక్రమం నిర్వహించి బూత్ కమిటీలు, ఓటర్ లిస్ట్ పన్నా ప్రముఖులను నియమించారు.

◆ కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

అక్కన్నపేట(హుస్నాబాద్): సీఎం కేసిఆ చొరవతో ఏర్పడిన మండలంపై చిన్నచూపు తగదని, వెంటనే సమీకృత భవనాలు నిర్మించే వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగుతుందని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి తొందూరు ఎల్లయ్య అన్నారు. రిలేదీక్ష గురువారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. దీక్షకు కాంగ్రెస్ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగపల్లి ఎల్లయ్య, కట్కూర్ గ్రామ సింగిల్ విండో వైస్ చైర్మన్ ముకుందరెడ్డి పాల్గొన్నారు.

◆ పాత రోడ్డును పునరుద్ధరించాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మల్లారం శివారు రాజీవ్‌రహదారికి సమాంతరంగా ఉన్న పాత నక్షా రోడ్డును వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ గ్రామస్తులు గురువారం చిన్నకోడూరు తహసీల్దార్ జయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. నక్షా రోడ్డును కబ్జా చేసి రైతుల మధ్య గొడవలు సృష్టిస్తున్నారన్నారు. పాత రోడ్డు నిర్మాణంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. పాత రోడ్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

◆ 24న పట్టణ బంద్

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలో పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని కోరుతూ ఈనెల 24న పట్టణ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు అఖిలపక్ష, జేఏసీ నాయకులు తెలిపారు. గురువారం వాసవి గార్డెన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణ భౌగోళిక, ఆర్థిక స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని వసూలు చేయాల్సిన పన్నులను అనాలోచిత నిర్ణయంతో పట్టణ ప్రజలపై మోయలేని భారాన్ని మోపడం సరికాదన్నారు. ఇంటి యజమానులకు పన్ను చెల్లించాలని డిమాండ్ నోటీసులు పంపుతూ ఇబ్బందులకు గురిచేయడం సమంజసంకాదన్నారు. ట్రేడ్ లైసెన్సు ఫీజుల పెంపును విరమించుకుని పాత పద్ధతిలోనే లైసెన్సులు జారీ చేయాలన్నారు. పట్టణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పన్ను పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్‌చేశారు. డిమాండ్‌ను నెరవేర్చాలని కోరుతూ ఈనెల 24వ తేదీన పట్టణ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ప్రకటించారు. బంద్‌కు వ్యాపార, వర్తక, వాణిజ్య సంస్థలు సహకరించాలని కోరారు.

◆ హనుమాన్ ఆలయాభివృద్ధికి విరాళం

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పాములపర్తి గ్రామంలో వీరహనుమాన్ దేవాలయాభివృద్ధికి బీఆర్ఎస్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు మేకల కనకయ్య గురువారం రూ. 51 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో నాచారం దేవాలయ చైర్మన్ హరిపంతులు, నాయకులు లక్ష్మణ్, రాములు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

◆ ప్లాస్టిక్ నిషేధిద్దాం

దుబ్బాక: ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామని రాయపోల్ మండల కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ పర్వేజ్ అన్నారు. గురువారం రాయపోల్ మండలం మంతూర్ పంచాయతీ కార్యాలయానికి స్టీల్ గ్లాసులు, ప్లేట్లను అందజేశారు. ప్లాస్టిక్‌ను నిషేధించడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధించడం కోసం స్టీల్ బ్యాంక్‌కు తన వంతు సహాయం అందించానన్నారు.

◆ వైభవంగా నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని లకుడారంలో అభయాంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో నందీశ్వర, సంతాన నాగేంద్ర స్వామి సమేత నవగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కార్య నిర్వాహకులు మేర్గోజు కరుణాకర్‌చారి, కాస్గుల చంద్రం, పత్తిరి రాము, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్, సర్పంచ్ కందూరి ఐలవ్వ, నాయకులు ఐలయ్య పుట్టమట్టిని ఊరేగింపుగా తీసుకువచ్చారు. కార్యక్రమంలో నాయకులు కంకణాల మల్లేశం, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం

దుబ్బాక: విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించి, ప్రణాళిక ప్రకారం చదివితే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. గురువారం దుబ్బాకలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో 10 వ తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

◆ రైతు కుటుంబానికి పరామర్శ

తొగుట(దుబ్బాక): మండలంలోని ఎల్.బంజేరుపల్లిలో విద్యుదాఘాతంతో మృతిచెందిన రైతు పిట్ల రామస్వామి కుటుంబాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి గురువారం పరామర్శించారు. రైతు మరణించడం బాధాకరమన్నారు. రైతు కుటుంబ ఆర్థిక పరిస్థితిని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. చిన్నారుల చదువుకు చేయూత అందిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల సత్యనారాయణ, ఎంపీటీసీ ఫోరం మండల అధ్యక్షుడు నర్సింలు, చెప్యాల మాజీ సర్పంచ్ మోహన్‌రావు, పీఏసీఎస్ డైరెక్టర్ కిష్టాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం

ములుగు(గజ్వేల్): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ములుగు ఎంపీపీ లావణ్యఅంజన్‌గౌడ్ అన్నారు. మండలంలోని కొక్కొండ గ్రామంలో రూ.11 లక్షల గడా నిధులతో నిర్మించనున్న యాదవ సంఘం, ముదిరాజ్ సంఘం భవనాల ప్రహరీ పనులకు, రూ.1.5లక్షల నిధులచే కొక్కొండ,సింగన్నగూడ గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపుల చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణానికి గురువారం సర్పంచ్ బంగ్ల గణేష్‌తో కలసి శంకుస్థాపన చేశారు.

◆ ఉగాది కథల పోటీలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సుగుణ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఉగాది కథల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ

నంగునూరు(సిద్దిపేట): ఖానాపూర్‌లోని హనుమాన్ దేవాలయంలో గురువారం శివ పంచాయతన నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆలయ ప్రదక్షిణ, గురు ప్రార్థన, గణపతి పూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

◆ ధరణి సమస్యలు పరిష్కరించాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): ధరణిలో నెలకొన్న సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు పర్శరాములు, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ భూముల రిజిస్ట్రేషన్ చేయించి నెలలు గడుస్తున్నా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు రానందున వారు బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారన్నారు. అధికారులు స్పందించి పాస్‌బుక్కులు అందించాలని డిమాండ్ చేశారు.